క్లుప్తంగా

డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న ఎంపీ గురుమూర్తి

ఏర్పేడు: తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి నూతన సంవత్సర అంబేడ్కర్ యువజన సంఘం డైరీని ఆవిష్కరించారు. మంగళవారం ఏర్పేడు అంబేడ్కర్ యువజన సంఘ నాయకులు తిరుపతిలో ఎంపీని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘం ముద్రించిన డైరీని ఎంపీ చేతుల మీదుగా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వాసు, గాలి రవి, చంద్ర, తోకల రవి, కృష్ణ, శ్రీనివాసులు, భరత్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్) : మండలంలోని పూడిలో బుధవారం స్పందన స్వచ్ఛంద సేవ సంస్థ, చాగడం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు ఉచిత కంటి పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అభ్యంతరాలు ఉంటే 15 రోజుల్లో తెలపాలి

శ్రీకాళహస్తి: ఇన్ ప్రిన్సిపాల్ లేఔట్ ప్యాట్రన్‌పై ఏవైనా అభ్యంతరాలు ఉంటే 15రోజులోగా తమ కార్యాలయంలో రాతపూర్వకంగా తెలియజేయాలని మున్సిపల్ కమిషనర్ బాలాజీ నాయక్ తెలిపారు. సర్వే నంబర్ 290/1, 2భూమికి లేఔట్ రెగ్యులరైజేషన్ కింద ఇన్ ప్రిన్సిపల్ లే అవుట్ ప్యాట్రన్‌ను తుడా అప్రూవల్ చేసిందన్నారు. ప్రజలు దీనిపై అభ్యంతరాలు ఉన్న పక్షంలో కార్యాలయంలో తెలియజేయాలని కోరారు.

నిత్యాన్నదానానికి విరాళం



విరాళం అందజేస్తున్న రసపుత్ర సుభాన్ సింగ్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలికి చెందిన రసపుత్ర సుభాన్‌సింగ్, కుటుంబ సభ్యులు మంగళవారం రూ.55,555 విరాళంగా పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేశారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు సుదర్శన్, ప్రముఖులు స్వర్ణమూర్తి, సెన్నీరు కుప్పం శేఖర్, ముత్యాల కృష్ణ, పాలకమండలి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధంపై పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న వాసురెడ్డి

ఏర్పేడు: మండలంలోని మేర్లపాకలో గడ్డివామి దగ్ధం ప్రమాదంపై ఎస్పీడీసీఎల్ ఈఈ వాసురెడ్డి మంగళవారం పరిశీలించారు. మేర్లపాకకు చెందిన రైతు రవి వేసిన గడ్డివామి ఈ నెల 15న అగ్నిప్రమాదానికి గురై ఆస్తినష్టం సంభవించడం విదితమే. దీనిపై స్పందించిన ట్రాన్స్‌కో ఈఈ గ్రామానికి వెళ్లి అగ్ని ప్రమాదానికి దారితీసిన కారణాలేమిటో గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ వాసుదేవయ్య, రైతులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు



విజేతలతో మంత్రి ఆర్కే రోజా, అలీ తదితరులు

నగరి : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆర్కే రోజా చారిటబుల్ ట్రస్ట్ వారు మంగళవారం వివిధ పోటీలు నిర్వహించారు. సంస్కృతి, సంప్రదాయాలను అద్దం పట్టేలా సంక్రాంతి సంబరాలు, ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మామిడి తోరణాలు, అరటి చెట్లు, చెరుకు గడలు, పొంగలి కుండలతో మైదానాన్ని విశేషంగా అలంకరించారు. సుమారు 377 మంది మహిళలు కనువిందుగా రంగవల్లులు తీర్చిదిద్దారు. ఈ క్రమంలోనే చిన్నారుల కోలాటాలు, భరత నాట్యాలు, డూడూ బసవన్న విన్యాసాలు, చిలకమ్మ జోస్యాలు, పతంగుల పోటీలు ఆకట్టుకున్నాయి. మెప్మా బజార్‌లో ఏర్పాటు చేసిన తెలుగింటి పిండివంటలు నోరూరించాయి. పట్టణంలోనే తొలిసారి భారీ స్థాయిలో నిర్వహించిన ముగ్గుల పోటీ విశేషంగా ఆకట్టుకుంది. నగరికి చెందిన విద్యాకుమారి ప్రథమ బహుమతిగా రిఫ్రిజిరేటర్‌ను గెలుచుకుంది. కొత్తపేటకు చెందిన తేన్‌మొళి రెండో బహుమతిగా వాషింగ్ మిషన్‌ను కైవసం చేసుకుంది. వీకేఆర్‌పురానికి చెందిన దివ్య మూడో బహుమతిగా 32 ఇంచీల టీవీని దక్కించుకుంది. మరో పది మంది స్టాండింగ్ ఫ్యాన్లను ప్రోత్సాహక బహుమతిగా అందుకున్నారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి

● ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి



లబ్ధిదారురాలు పొందిన సంక్షేమ పథకాల లబ్ధి గురించి తెలియజేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాల ఫలాలను తమ ప్రభుత్వం ఇస్తోందన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని పెద్ద కనపర్తి, చిన్న కనపర్తి దళితవాడలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. బుక్‌లెట్లను అందజేసి ఆయా కుటుంబాలు పొందిన పథకాల లబ్ధిని తెలియజేశారు. సమస్యలు ఏవైనా ఉన్నపక్షంలో శ్రీకాళహస్తిలో నేరుగా పార్టీ కార్యాలయంలో కూడా తెలియజేయవచ్చన్నారు. గ్రామంలో కొందరికి పింఛన్లు రద్దు చేశారని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. ప్రజలు నివేదించిన సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు ఉన్నం వాసుదేవ నాయుడు, జెడ్పీటీసీ సభ్యురాలు అర్చనాదేవి, ఎంపీడీఓ తరుణాక్షి రెడ్డి, డీటీ సుధీర్‌రెడ్డి, మునిరత్నం, సర్పంచ్ విమల, ఎంపీటీసీ సుబ్రహ్మణ్యం, మాజీ ఎంపీటీసీ మణి నాయుడు, రామకృష్ణ నాయుడు, చెంగరాయులు నాయుడు, గాలి బాలాజీ నాయుడు, వెంకటేశ్వరులు నాయుడు, పిల్లమెడు గురవయ్య, పలువురు నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సుపరిపాలనకు చిహ్నం శ్రీకృష్ణదేవరాయలు



శ్రీకృష్ణదేవరాయలుకు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: సుపరిపాలనకు చిహ్నం శ్రీకృష్ణదేవరాయలు అని స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం శ్రీకృష్ణదేవరాయలు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు పాలనలో ప్రజలు ఎంతో ఆనందంగా ఉండేవారని, పంటలు సస్యశ్యామలంగా పండేవన్నారు. ప్రస్తుతం రాయలవారి పాలన మరిపించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఉందని కొనియాడారు. బలిజ సంఘం నాయకులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయల ఆశయ సాధనకు కృషి చేద్దాం



శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం ముందు నివాళులు అర్పిస్తున్న అంజూరు తదితరులు

శ్రీకాళహస్తి: శ్రీకృష్ణదేవరాయల ఆశయ సాధనకు కృషి చేయాలని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు.మంగళవారం శ్రీకృష్ణదేవరాయలు జయంతి పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయం సుపథ మండపం వద్ద ఉన్న శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. శ్రీకృష్ణదేవరాయలుకు శ్రీకాళహస్తికి ఎంతో అనుబంధం ఉందన్నారు. రాజగోపురం నిర్మించడమే కాకుండా ఆలయంలో అచ్యుతరాయ మండపం నిర్మించి అందులో తన కుమారునికి పట్టాభిషేకం నిర్వహించారన్నారు. అంతే కాకుండా ఈ ప్రాంతంలో అత్యధికంగా చెరువులు నిర్మించి భూగర్భ జలాలు పెంపొందించేందుకు కృషి చేశారన్నారు. రైతులకు సాగునీటిని అందించిన ఘనతాయనకే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఉప్పు కృష్ణయ్య, స్వర్ణమూర్తి, పూల కృష్ణమూర్తి, ప్రభాకర్, సాధన మున్నా, సెన్నీరుకుప్పం శేఖర్, మొగరాల గణేష్, చింతామణి పాండు, కంఠా ఉదయ్, బాలాజి, ముత్యాల కృష్ణ, యతిరాజులు, రామకృష్ణ, సిద్ధులగారి ప్రసాద్, పసుపులేటి జనార్ధన్, పసల సుమతి, పసల కృష్ణయ్య, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

108లో ప్రసవం



శిశువును కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఈఎంటీ రేవతి

కేవీబీపురం: మండలంలోని కల్లపూడికి చెందిన దేవసేన 108లో ప్రసవించింది. ఈఎంటీ సతీష్ తెలిపిన వివరాలు.. దేవసేనకు మంగళవారం వేకువజామున పురుటి నొప్పులు రావడంతో ఆమెను కుటుంబ సభ్యులు 108కు సమాచారమిచ్చారు. నిమిషాల వ్యవధిలోనే అక్కడికి చేరుకున్న 108 అంబులెన్స్‌లో ఆమెను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా నొప్పులు తీవ్రమయ్యాయి. దీంతో ఈఎంటీ రేవతి,పైలెట్ వాహనాన్ని కోవనూరు వద్ద ఆపి ఆశా వర్కర్ సాయంతో కాన్పు చేశారు. ఆమె పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లి, శిశువును కాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు సమాచారం.

వాలీబాల్ టోర్నీ విజేతలకు బహుమతులు



రేణిగుంట : విజేతలకు మెడల్స్ అందజేస్తున్న జూలియస్‌రాజు

రేణిగుంట: మండలంలోని గుత్తివారిపల్లెలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. చిత్తూరు నెహ్రూ యువజనకేంద్రం, రేణిగుంట ఆషా సంస్థ సంయుక్తంగా ఈ టోర్నీ నిర్వహించారు. విన్నర్స్ జట్టుకు మెడల్స్ అందజేశారు. గ్రామీణ యువత జూదం, వ్యసనాలకు బానిస కాకుండా క్రీడల వైపు మొగ్గు చూపాలని గ్రామ సర్పంచ్ మంజుల, ఆషా సంస్థ అధ్యక్షుడు జూలియస్‌రాజు కోరారు.

ముగ్గుల పోటీలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని జీఎస్‌కండ్రిగలో మంగళవారం సర్పంచ్ దాము, గ్రామస్తుల ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు ఉత్సాహంగా రంగురంగుల ముగ్గులు వేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల విజేతలకు మండల వైఎస్సార్‌సీపీ యూత్ నాయకులు జ్ఞానకుమార్ రూ. 7 వేల నగదు బహుమతి ప్రదానం చేశారు.

పోలీసుల అదుపులో నలుగురు దొంగలు?

శ్రీకాళహస్తి: పట్టణంలో చోరీలకు పాల్పడిన దొంగలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల ఓ చోరీ కేసుకు సంబంధించి నలుగురు దొంగలను గుర్తించి మంగళవారం రాత్రి 1వ పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్టు సమాచారం.

2 తలలు, 6 కాళ్లతో దూడ జననం



మండలంలోని బోలినాయుడు కండ్రిగలో రెండు తలలు, ఆరు కాళ్లతో వింత దూడ పిల్ల జన్మించింది. గ్రామానికి చెందిన రైతు మణి ఇంట గేదె మొదటి ఈతలో ఒక దూడకు జన్మనిచ్చింది. రెండో ఈతలో మాత్రం వింత దూడకు జన్మనిచ్చింది. దీనిని చూసేందుకు జనం ఆసక్తి చూపారు. జన్మించిన కొంతసేపటికే ఈ దూడ మరణించింది.

- కేవీబీపురం

ఏఓగా సుహర్‌లత



వరదయ్యపాళెం: మండల వ్యవసాయశాఖ అధికారిణిగా సుహర్‌లత మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె డిప్యుటేషన్‌పై ఉమ్మడి చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇక్కడ 6నెలలుగా ఏఓ పోస్టు ఖాళీగా ఉండడంతో ప్రభుత్వం స్పందించి భర్తీ చేసింది. ఏఓ మాట్లాడుతూ.., ప్రధానంగా పీఎం కిసాన్ పథకానికి ఈకేవైసీ చేసుకోవాల్సిన రైతులు 600 మంది ఉన్నారని, పూర్తిస్థాయిలో ఈకేవైసీ నమోదు చేసే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు.

అందరికీ అందుబాటులో పార్టీ కార్యాలయం



నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న సచివాలయ కన్వీనర్లు

● వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి

వెంకటగిరి: నియోజకవర్గ ప్రజలతోపాటు వైఎస్సార్ సీపీ శ్రేణులకు అందుబాటులో ఉండడానికే నూతన పార్టీ కార్యాలయం ఏర్పాటు చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక నేదురుమల్లి నివాసంలో మంగళవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుధవారం ఉదయం 9.45 గంటలకు పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహిస్తామని, ప్రతి ఒక్కరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నియోజకవర్గంలో నిర్వహించబోయే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతోపాటు పార్టీ కేంద్ర కార్యాలయం సూచించే కార్యక్రమాల నిర్వహణ పక్కాగా జరిగేలా స్థానిక కార్యాలయం నుంచి పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. కార్యాలయ సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు.


నేదురుమల్లికి సన్మానం

నియోజకవర్గంలోని సచివాలయ కన్వీనర్లు పలువురు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి, సత్కరించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో వివరించి పార్టీ ప్రతిష్టను పెంచడానికి కృషి చేయాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి జిల్లాలోనే అత్యధిక మెజారిటీ వెంకటగిరి నియోజకవర్గంలో సాధించేలా సచివాలయ కన్వీనర్లు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు చెలికం శంకరరెడ్డి, నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు పి దశరథరామిరెడ్డి, వీ కార్తీక్‌రెడ్డి, నర్రావుల వేణునాయుడు, జీ అరుణాచలం, నాగయ్య, కౌన్సిలర్లు వహీదా యస్థానీ, కె కృష్ణమూర్తి, ఏ శ్రీనివాసులురెడ్డి, నాయకులు తోట గణేష్‌రెడ్డి, బండి రమేష్‌రెడ్డి, ఎం నరసింహులు, సి శ్రీనివాసులురెడ్డి, కోటి, గోపాల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంజేరమ్మకు ప్రత్యేక పూజలు

వడమాలపేట : సంక్రాంతి సంబరాల్లో భాగంగా మంగళవారం ఎస్వీ పురం పంచాయతీలోని అంజేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే వడమాలపేట, అప్పలాయిగుంట, వడమాలలోని ఆలయాల్లో విశేష పూజలు జరిపించారు.

రంగోలి, గాలిపటాల పోటీలు



బహుమతులు అందజేస్తున్న వనిత క్లబ్ ప్రతినిధులు

సూళ్లూరుపేట: సంక్రాంతి పండుగ సందర్భంగా వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక సాయిబాబా మందిరం ప్రాంగణంలో మంగళవారం మహిళలకు ముగ్గులపోటీలు, చిన్నారులకు గాలిపటాల పోటీలు ఘనంగా నిర్వహించారు. రంగోళి కార్యక్రమంలో మహిళలు పాల్గొని, రంగవల్లులు తీర్చిద్దారు. అలాగే చిన్నారుల కూడా గాలిపటాలను ఎగురవేసి సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా అయితా సుభాషిణి, మురిగిపూడి పద్మజ వ్యవహరించి, విజేతలను ఎంపిక చేశారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులను వాసవీక్లబ్ ప్రతినిధి బండారు శబరీష్ చేతులు అందజేశారు. వనితక్లబ్ అధ్యక్షురాలు సునీత, కార్యదర్శి కళావతి, కోశాధికారి శైలజ, సాయిబాబా ఆలయ ప్రతినిధి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణపల్లె ఎస్టీ కాలనీకి విద్యుత్ సౌకర్యం





విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

● సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసిన గ్రామస్తులు

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని బ్రాహ్మణపల్లె ఎస్టీకి విద్యుత్ సౌకర్యం కల్పించడంతో ఆ కాలనీ వాసుల ఆనందానికి హద్దుల్లేకుండా పోయింది. ఎంతోకాలంగా ఎదుర్కొంటున్న సమస్య ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చొరవతో పరిష్కారం కావడంతో ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వివరాల్లోకి వెళితే.. బ్రాహ్మణపల్లె పంచాయతీ పాపనపల్లె పరిధిలో ఎప్పటి నుంచో 15 ఎస్టీ కుటుంబాలు నివసిస్తున్నాయి. అయితే అక్కడకు వెళ్లాలంటే ఎలాంటి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడేవారు. పొలాల గట్ల మీదుగా ఇళ్లకు చేరుకునే దుస్థితి. దారి లేకపోవడంతో అధికారులు కూడా ఆ వైపు వెళ్లేవారు కాదు. తమకు రోడ్డు సౌకర్యం కల్పించాలని గత పాలకులకు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా ఫలితం శూన్యం. ఈ నేపథ్యంలో రెండేళ్ల క్రితం స్థానిక ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి తమ అవస్థలను నివేదించారు. స్పందించిన ఆయన రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. ఆయన ఆదేశాలతో రెవెన్యూ అధికారులు పాపనపల్లె నుంచి బ్రాహ్మణపల్లె మీదుగా మేలచ్చూరుకి వెళ్లే ప్రధాన మార్గం పక్కనే బ్రాహ్మణపల్లె చెరువుకు ఎగువ భాగాన ప్రభుత్వ స్థలంలో వారికి పట్టాలు, పక్కా గృహాలు మంజూరు చేశారు. వీరిలో ఎనిమిది కుటుంబాలు పక్కా గృహాలు నిర్మించుకున్నాయి. అయితే వీరికి విద్యుత్ సమస్య ఉండడంతో నెల క్రితం మరోసారి ఎమ్మెల్యేను కలిసి సమస్యను ఆయన దృష్టికి తెచ్చారు. ఆయన ఆదేశాలతో ట్రాన్స్‌కో అధికారులు రంగంలో దిగారు. ఎస్టీ కాలనీకి యుద్ధప్రాతిపదికన కరెంటు వసతి కల్పన పనులు దగ్గరుంచి పూర్తి చేయించారు. దీంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

గుండెపోటుతో వైఎస్సార్ సీపీ నేత మృతి

● నివాళులు అర్పించిన ఎంపీ, ఎమ్మెల్యే



గోపియాదవ్ మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని వీయస్‌పురం గ్రామ పంచాయతీ వేణుగోపాలపురానికి చెందిన మండల వైఎస్సార్ సీపీ మాజీ కన్వీనర్, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి చిట్టిబోయిన గోపియాదవ్ (46)మంగళవారం గుండెపోటుకు గురై హఠాన్మరణం చెందారు. ఆయన భౌతిక కాయానికి తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్ తదితరులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన పార్టీకి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఆయన కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని ధైర్యవచనాలు పలికారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ అరణి విద్యానాథరెడ్డి, కేంద్ర పర్యాటక శాఖ మాజీ డైరెక్టర్ సురేంద్ర కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రవిరెడ్డి, గురునాథం, గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రవి తదితరులు పాల్గొన్నారు.

దోమల లార్వాలను నిర్మూలిద్దాం



దోమలు, లార్వాల నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): దోమలు, లార్వాల నిర్మూలనకు ప్రజలు తమ వంతు కృషి చేయాలని హెల్త్ సూపర్‌వైజర్ కామరాజు కోరారు. మంగళవారం ఆయన ఆరోగ్య కేంద్ర సిబ్బందితో జగనన్న కాలనీలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి దోమల లార్వాల నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలతోపాటు దోమల బెడద బారిన పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. బంతి, తులసి, పుదీనా, లవెండర్ మొదలైన మొక్కలను ఇళ్లలో పెంచుకుంటే వాటి నుంచి వెలువడే వాసనకు దోమలు ఆ దరిదాపులకు రావని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ సంపూర్ణ, భారతి, ఏఎన్ఎం వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసు పునరుద్ధరించరూ!

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజులపెళ్లూరు గ్రామానికి ఆర్టీసీ బస్సును నడపాలని గ్రామ మహిళలు విజ్ఞప్తి చేశారు. వారు మాట్లాడుతూ, గతంలో గ్రామంలోకి ఆర్టీసీ బస్సు వచ్చేదని, ఇప్పుడు బస్సులు గ్రామంలోకి రాకుండా సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, బైపాస్‌లో వెళ్లిపోతున్నాయని నిరసన వ్యక్తం చేశారు. ఏడేళ్లుగా గ్రామంలోకి బస్సులు రావడం లేదని చెప్పారు. సూళ్లూరుపేట రోడ్డు నుంచి గ్రామంలోని రెండు కిలోమీటర్ల దూరం ఉందని, బస్సు నడపాలని గత ప్రభుత్వ హయాంలో అధికారులను కోరినా పట్టించుకోలేదని, ప్రస్తుత ప్రభుత్వంలోనైనా తమ గ్రామానికి బస్సు ఏర్పాటు చేయాలని కోరారు.

వైభవంగా కొండచుట్టు



పుత్తూరు మున్సిపల్ చైర్మన్ హరి ఆధ్వర్యంలో పందరి భజన



పుత్తూరు మండపం వద్దకు వస్తున్న ఆంజనేయస్వామి



నగరి: మండపం వద్ద కొలువుదీరిన కరకంఠేశ్వరుడు

నగరి : నగరి పట్టణంలో కొండచుట్టు ఉత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మంగళవారం ఉదయం నుంచే కొండచుట్టు మండపం వద్ద హడావుడి మొదలైంది. పరిసర గ్రామాల నుంచి వచ్చే దేవతలకు ఆహ్వానం పలికేందుకు ముందుగా వెళ్లాల్సిన కరకంఠేశ్వర స్వామికి ఉదయం నుంచే ఆలయ అర్చకులు అభిషేక, అర్చనలు చేసి అలంకరణ ప్రారంభించారు. అలంకరణ ముగించిన తరువాత వచ్చే దేవతలకు స్వాగతం పలికేందుకు సాయంత్రం కొండచుట్టు మండపం వద్దకు తీసుకువెళ్లారు. సాయంత్రం మండపం వద్దకు దేవతామూర్తులు చేరుకోగా, భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో ఆ ప్రాంతమంతా సందడి వాతారవణం నెలకొంది.

నిండ్ర: మండలంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో గ్రామ దేవతల కొండచుట్టు నిర్వహించారు. కర్పరవేడు, నేట్టేరి, మేళంబాకం, చవరంబాకం, ఆలపాకం గ్రామ దేవతలను ప్రత్యేకంగా అలంకరించారు. దేవతలను ఊరేగిస్తూ కొండ ప్రదక్షిణ చేశారు.

పుత్తూరు రూరల్: మకర సంక్రాంతి సంబరాల్లో భాగంగా నాలుగో రోజు కొండచుట్టు కోలాహలంగా నిర్వహించారు. పట్టణంలోని కామాక్షి సమేత సదాశివేశ్వరస్వామి వార్ల ఆహ్వానం మేరకు చుట్టుపక్కల గ్రామాల నుంచి దేవతా మూర్తులను కొండచుట్టు మండపం వద్ద కొలువుదీర్చారు. ముందు కామాక్షీ సమేతంగా సదాశివేశ్వరుడు ఆశీనులు కాగా, అతిథులుగా విఘ్నేశ్వరుడు, రుక్మిణీ సత్యభామ సమేత కృష్ణుడు, ద్రౌపదీదేవి సమేత అర్జునుడు, సీతా సమేత శ్రీరాముడు, ఆంజనేయస్వామిని అధిష్టింపజేశారు. మున్సిపల్ చైర్మన్ హరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పందరి భజన అలరించింది.